ప్రజాశక్తి
గురువారం 21 మార్చి 2024 8 పేజీలు


గుంటూరు పల్నాడు

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

- వాలంటీర్లతో భేటీలు-కానుకల అందచేత
- విధుల నుండి 45 మంది తొలగింపు
- ప్రజాప్రతినిధుల సేవలో ప్రభుత్వ ఉద్యోగులు!
- గుంటూరు కార్పొరేషన్‌లో అమలవ్వని కమిషనర్ ఉత్తర్వులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలుకు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఏమాత్రమూ పట్టించుకోవడంలేదు. వాలంటీర్లను ఎన్నికల విధులల్లో ఉంచరాదని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చినా పలువురు వైసిపి నియోజకవర్గాల సమన్వయకర్తలు వారితో సమావేశాలు ఏర్పాటు చేసి తాయిలాలు అందచేస్తున్నారు. కార్యకర్తలను పట్టించుకోని అభ్యర్థులు వాలంటీర్లతో మమేకం అవుతున్నారని వైసిపిలోనే అంతర్గతంగా విమర్శలు వస్తున్నా ప్రజలకు సంబంధించిన డేటా అంతా వాలంటీర్ల వద్ద ఉండటం వల్ల వారిపైనే అభ్యర్థులు ఆధారపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పొన్నూరు నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి అంబటి మురళీ ఏర్పాటు చేసిన సమావేశానికి వెళ్లిన 45 మంది వాలంటీర్లను బుధవారం అధికారులు తొలగించారు. చేబ్రోలు మండలంలో 37 మంది, పెదకాకాని మండలంలో 8 మందిని తొలగించినట్టు ఎంపీడీవోలు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో అధికారులు స్వాధీనం చేసుకున్న చీరలు

బుధవారం గుంటూరులోని జెకెసి కళాశాల రోడ్డులో తన కార్యాలయంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి అభ్యర్థి బి.రామాంజనేయులు అక్కడికి వెళ్లగా వైసిపి నాయకులు దాడి చేశారని పోలీసులకు రామాంజనేయులు ఫిర్యాదు చేశారు. అయితే రామాంజనేయులు తమ కార్యాలయంపైకి కావాలనే దాడికి వచ్చారని వైసిపి నాయకులు ఆరోపించారు. ఇదిలా ఉండగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో వైసిపి నాయకులు ఓటర్లకు పంపిణీ చేయడానికి సిద్ధ చేసుకున్న చీరలను ఎన్నికల అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు.

మరోవైపు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వద్ద ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పటికీ చాలాచోట్ల కొనసాగుతున్నారు. ఎన్నికల కోడ్ రాగానే వారి వద్ద నుంచి ఉద్యోగులను, అధికారులను తొలగించి వారి ▶ 2లో


సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

రెండు నెలలు దాటుతున్నా దక్కని పరిహారం

- శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాద బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి
- పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మండల కేంద్రమైన దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జనవరి 19న అగ్ని ప్రమాదం వాటిల్లగా పసుపు పంట దగ్ధమైన ఘటనలో బాధిత రైతులకు సత్వరమే న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితుల సమావేశం వడ్డేశ్వరం కేబీ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం, అగ్ని ప్రమాద బాధితుల రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. సమావేశానికి బాధిత రైతుల సంగం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షత వహించారు. జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ప్రమాదం జరిగి రెండు నెలలు దాటుతున్నా యాజమాన్యం గాని, ప్రభుత్వంగాని, అధికారులు గాని న్యాయం చేయలేదన్నారు. వాస్తవ రైతులను ప్రభుత్వం గుర్తించకపోగా, నష్టపరిహారం కూడా చెల్లించలేదని ▶ 2లో


సమావేశంలో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ

బిజెపికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నం

- మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం
- 23న విస్తృతంగా భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలు
- రైతు, కార్మిక, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశాన్ని ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో బిజెపి పాలిస్తోందని, ఆ పార్టీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చి పోరాటాలకు సిద్ధం చేయాల్సిన నింపి పోరాటాలకు సిద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కోటప్పకొండరోడ్డు ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు, కార్మిక, మహిళా, విద్యార్థి, యువజన ఇతర ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు అధ్యక్షత వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీలో రైతులు చేపట్టిన ఆందోళన సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధర చట్టం చేయాలని, రైతుల రుణ విముక్తి కోసం కమిషన్ ఏర్పాటు చేయాలని, వ్యవసాయ విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. అంబానీ, అదానీలకు ఊడిగం చేస్తూ దేశ ▶ 2లో



ప్రొఫెసర్ ఫెడరిక్ లారెన్స్ కూలిడ్జ్ ను సత్కరిస్తున్న వీసీ రాజశేఖర్

బౌద్ధం.. శాంతియుత మతం..

వర్సిటీ అంతర్జాతీయ సదస్సులో కొలరాడో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఫెడరిక్ లారెన్స్ కూలిడ్జ్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

అన్ని మతాలకంటే బౌద్ధమతం శాంతియుతమైందని అమెరికాలోని కొలరాడో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఫెడరిక్ లారెన్స్ కూలిడ్జ్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బుద్ధిజం విభాగం ఆధ్వర్యంలో 'బుద్దిస్ట్ ఫిలాసఫీ ఆఫ్ మైండ్ అండ్ కాగ్నిటివ్ సైన్స్ విత్ హ్యూమన్ మోరల్ ఎక్స్పీరియన్స్' అంశంపై మూడ్రోజుల అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి రిజిస్ట్రార్ బి.కరుణ అధ్యక్షత వహించారు. ఫెడరిక్ లారెన్స్ కూలిడ్జ్ కీలకోపన్యాసం చేస్తూ బౌద్ధ మతంలో హిందూ, జైన వంటి ఇతర మతాల భాగస్వామ్యం చేయబడ్డాయని, ▶ 2లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సాయంత్రం) : 6.24

సహరీ (శుక్రవారం ఉదయం) : 4.55


స్టేషన్ ఆవరణలో ఘర్షణ పడుతున్న వారిని వారిస్తున్న పోలీసులు

టిడిపి,వైసిపి కార్యకర్తల ఘర్షణ

- వాలంటీర్లకు కానుకలు ఇస్తున్నారని టిడిపి ఆరోపణ
- కావాలని దాడికి వచ్చారని వైసిపి ఫిర్యాదు

వార్త మెయిన్‌లో

కొనసాగుతున్న 'పది' పరీక్షలు 2లో

కోడ్ ఉల్లంఘిస్తే వాలంటీర్లపై చర్యలు

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి 8 లో



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీమంత్రి మాకినేని పెద రత్తయ్య

పశ్చిమ టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి పశ్చిమ నియోజకవర్గం కార్యాలయాన్ని మాజీమంత్రి మాకినేని పెద రత్తయ్య బుధవారం ప్రారంభించారు. స్థానిక శ్రీనివాసరావుపేటలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో టిడిపి పశ్చిమ ఇన్‌ఛార్జి పిడుగురాళ్ల మాధవి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం టిడిపిని గెలిపించాల్సి ఉందన్నారు. విద్యా, వైద్య రంగాలతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమల ఏర్పాటు దిశగా చంద్రబాబు గతంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. రావిపాటి సాయి కష్ణ మర్యాదపూర్వకంగా కలిసి మాధవి విజయాన్ని కాంక్షిస్తూ సైకిల్ గుర్తుతో కూడిన జ్ఞాపికను అందజేశారు. ఎన్నికల్లో గుంటురు పశ్చిమ అభ్యర్థి విజయంతో పాటు పార్లమెంటు పరిధిలోని ఎంపి పెమ్మసాని మరియు ఏడుగురు అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కషి చేస్తామని సాయి కష్ణ తెలిపారు. కార్యక్రమంలో టిడిపినాయకులు మద్దిరాల మ్యాని తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి - తెనాలి

ఒంటరిగా నడిచి వెళుతున్న మహిళ మెడలో గొలుసును దుండగుడు బలవంతంగా లాక్కెళ్ళిన ఘటనపై ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని నాజర్‌పేటలో అదే ప్రాంతానికి చెందిన మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుంచి బైక్‌పై వచ్చిన అగంతకుడు ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఇరు వర్గాలపై కేసులు నమోదు : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో పత్తిపాడు వైసిపి కార్యాలయంలో వాలంటీర్ల భేటి జరుగుతుందనే నెపంతో టిడిపి ఇన్‌ఛార్జి రామాంజనేయులు వెళ్లి నేరుగా దాడికి వెళ్లడం తగదని జిల్లా ఎస్‌పి తుషార్ దూడి పేర్కొన్నారు. ఈ ఘటనలో ఘర్షణపడిన ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరిగినట్టు ఎవరి దృష్టికి వెళ్లినా అధికారులకు ఫిర్యాదు చేయాలే కానీ నేరుగా వెళ్లి ఘర్షణలకు దిగడం సరికాదన్నారు. ఈమేరకు బుధవారంరాత్రి ప్రకటన విడుదల చేశారు. వైసిపికి చెందిన బలసాని కిరణ్ కుమార్ ఇంటి వద్ద వాలంటీర్ల తో సమావేశం నిర్వహిస్తున్నారన్న సమాచారమును నిర్ధారించుకోకుండా టిడిపి నాయకులు రామాంజనేయులు తన అనుచరులతో అక్కడకు చేరుకున్నప్పుడు ఇరువర్గాల కార్యకర్తల మధ్య ఘర్షణ కు కారణం అయ్యారని తెలిపారు. అదే సమయంలో సమాచారం అందుకున్న నల్లపాడు పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారిని అక్కడనుండి పంపివేసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేయమని సూచించారన్నారు. తరువాత ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. దర్యాప్తులో బాధ్యులైన వారిని గుర్తించి వారిపై తగు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఎవ్వరూ ప్రత్యక్ష చర్యలకు పాల్పడకుండా ఎన్నికల విభాగం అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. 0863 2234301, 2216206, 2216215, 2214726, 2216221, 2388278, లేదా 18004251292 కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరికి వారు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటే శాంతిభద్రతలకు విఘాతం కలిగి ఇరు వర్గాలకు ధన, వస్తు, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. అలా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ఎవరిమీదైనా దాడులకు పాల్పడినా లేక అవతల వారిని భయభ్రాంతులకు గురిచేసినా ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కఠినమైన చర్యలు తీసుకొనడం జరుగుతుందన్నారు.

యెనో యాప్‌లో మోసం జరిగితే బ్యాంకుదే బాధ్యత

ప్రజాశక్తి - దుగ్గిరాల

యెనో యాప్‌లో మోసం జరిగితే బ్యాంకు బాధ్యత వహిస్తుందని, ఇతర యాప్‌ల ద్వారా జరిగితే తమ బాధ్యతేమీ ఉండదని మండల కేంద్రమైన దుగ్గిరాల లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మేనేజర్ హెచ్ గోపి అన్నారు. గూగుల్ పే, ఫోన్‌పేలకు ప్రత్యామ్నా యంగా ప్రభుత్వ రంగ సంస్థ ఎస్‌బిఐ యోనోయాప్‌ను ప్రవేశపెట్టిందని చెప్పారు. నగదు డిపాజిట్ మినహా మిగి లిన అన్ని లావాదేవీలు ఈ యాప్ ద్వారా చేసు కోవచ్చని తెలిపారు. ఎటిఎంలో డబ్బు డ్రా చేయడానికి ఎటిఎం కార్డ్ అవసరం లేకుండా ఈ యాప్ ద్వారానూ డ్రా చేసు కునే వీలుందన్నారు. ఆ విధా నాన్ని ఖాత దార్లకు తమ సిబ్బంది అవ గాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఈ యాప్‌లో ఇతర బ్యాంకుల ఖాతాలు కూడా యాడ్ చేసుకోవచ్చని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యాకు సంబంధించిన అన్ని లావా దేవీలు ఈ యాప్ ద్వారా చేసుకోవచ్చని, షేర్స్, మ్యూచువల్ ఫండ్స్, క్రెడిట్ కార్డ్స్, ఎస్ బిఐకు సంబంధించిన వివరాలతో పాటు ఎల్ఐసికి సంబంధించిన వివరాలు ఉంటా యని వివరించారు. ఈ యాప్ ద్వారా రూ.10 లక్షల వరకు లావాదేవీలు ఒకేసారి చేసుకోవచ్చని, సెలవు దినాల్లోనూ ఇది పని చేస్తుందని అన్నారు. ఎటిఎంలో డబ్బులు డ్రా చేసేటప్పుడు కరెంటు పోయినా ఈ యాప్ పనిచేస్తుందన్నారు. రైల్వే టికెట్లు, ఇతర పేమెంట్లు, పెన్షన్ స్లిప్పులు, ప్రావిడెంట్ ఫండ్లు, రుణాలు తది తర వివరాలన్నీ తెలుస్తాయని చెప్పారు. బ్యాంకు ఖాతాదారులు జరిపే లావా దేవీ లను అనుసరించి రూ.8 లక్షల వరకు బ్యాంక్‌కు రాకుండానే రుణాలు పొందవచ్చ న్నారు. డిపాజిట్ల మెచ్యూరిటీని కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని, ఖాతా



ఎస్‌బిఐ దుగ్గిరాల మేనేజర్ గోపి

దారుని అసలు పేరుకు బదు లుగా షార్ట్ కట్‌లో రహస్య పేరు, పాస్‌వర్డ్ గుర్తు పెట్టు కోవాల్సి ఉంటుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల్లో మోసాలను అరికట్టేందుకు ఈ యాప్ ఉపయుక్తమన్నారు.

బిజెపికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నం

(మొదటి పేజీ తరువాయి)

సంపదను దోచిపెడుతున్న బిజెపి మరోవైపు రైతులు సమస్యల పరిష్కారం పోరాడుతుంటే తీవ్ర నిర్బంధం విధిస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తున్న కేంద్రం ప్రజలపైన మాత్రం భారాలు మోపుతోందని విమర్శించారు. ఈ విధానాలను అడ్డుకోకుంటే రైతులు, కార్మిక వర్గానికి ముప్పు తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 23న భగత్ సింగ్ వర్ధంతిని వాడవాడలా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఆల్ ఇండియా కిసాన్ సభ నాయకులు టి.ఆంజ నేయులు మాట్లాడుతూ బిజెపి అవలంబిస్తున్న మతోన్మాద విధానాలను ఎండగట్టాలని, ఆ పార్టీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతిస్తున్న టిడిపి, జనసేన, వైపిపిలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమవ్వాలని కోరారు. ఆయా పార్టీల నాయకులు అధికారం కోసం మోడీని ప్రసన్నం చేసుకుంటూ రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయబూనుకున్నారని విమర్శించారు. ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అముల ద్వారా వ్యవసాయ రంగం బలోపేతం అవుతుందని చెప్పారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను పరోక్షంగా అమలు చేయడానికి బిజెపి యత్నిస్తోందని, అదే జరిగితే దేశం తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని హెచ్చరించారు. రాజ్యాంగ విలువలకు బిజెపి పాతరేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని, ప్రజల మధ్య మత చిచ్చు రేపి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తోందని విమర్శించారు. వీటిని అడ్డుకోకుంటే దేశం ప్రమాదంలో పడుతుందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, మండల అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, ఐద్వా నాయకులు జి.ఉమశ్రీ, ఫాతిమా, ఎఐటియుసి నాయకులు వి.వెంకట్, పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఎన్.రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా నాయకులు కె.ఏడుకొండలు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు ఆంజనేయరాజు, సాయికుమార్, ముస్లిం మైనారిటీ జేఏసీ నాయకులు జిలాని మాలిక్ పాల్గొన్నారు.

బౌద్ధం.. శాంతియుత మతం..

(మొదటి పేజీ తరువాయి)

అన్ని మానవ ప్రవర్తనలు, మనస్సులను ప్రభావితం చేసే జన్య సిద్ధాంతాల్లో బౌద్ధం ఇమిడి ఉందని చెప్పారు. ఇది ఇతర మతాల కంటే ముందే ఉందన్నారు. అహింసలో కొంత భాగం జెనాఫోబియా, లైంగిక, దూకుడు వంటి వారి సహజమైన ఆధార ప్రేరణల నుండి మానవులను విడిపించడానికి బౌద్ధమతం దోహదపడుతుందని, భావోద్వేగాలను నియంత్రించగలగడం, అహింస, శాంతి బౌద్ధ తత్వాలకు ముఖ్యమైన నాడీ శాస్త్రం ఆధారం అని వివరించారు. ప్రపంచంలో మానవ ఆలోచనలను, స్వభావాలను ప్రభావితం చేసే మతంగా బౌద్ధం నిలుస్తుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ క్రైస్తవం, హిందూ, పార్సీ, జైన్ వంటి మతాలతో పోలిస్తే బౌద్ధాన్ని సులభంగా అర్థం చేసుకోగలమన్నారు. బుద్ధిజం ద్వారా మానవ మనుగడ సానుకూల దక్పథం వైపు పయనిస్తుందన్నారు. జ్ఞానంతో జీవించిన వారికి మరణ భయం ఉండదని, బౌద్ధమతంలో శాంతి, దయ, సహాయం వంటివి కనిపిస్తాయని చెప్పారు. అనంతరం సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్.ఉదయ్ కుమార్ మాట్లాడారు. తైవాన్, వియత్నాం, అమెరికా, లావోస్, జపాన్, మయన్మార్, నేపాల్, శ్రీలంక తదితర దేశాల నుంచి 16 మంది, ఐఐటీల నుంచి 17 మంది, కేంద్రీయ విశ్వవిద్యాలయాల నుంచి 20 మంది, రాష్ట్రస్థాయి యూనివర్సిటీల నుంచి 32 మంది అధ్యాపకులు పరిశోధన పత్రాలు పంపించారని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ స్వరూపరాణి, బుద్ధిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ శేషగిరిరావు, అధ్యాపకులు, పరిశోధకులు, మాంకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి గైనికాలజి వార్డు లో నిరూపయోగం గా ఉన్న ఒక గదిని గమనించి వాడుకలోకి తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం గైనకాలజీ వార్డును తనిఖీ చేస్తున్న సమయంలో ఒక రూమ్‌కు తాళలు వేసి ఉండటాన్ని గమనించారు. ఒక వైపు గదిలో ఎక్సిసిటింగ్ ఫ్యాన్ తిరుగుతుండటం, లైట్ ు వెలుగుతుండటం తో అనుమానం వచ్చి సిబ్బంది తో తాళాలు తీయించారు. గది అంతటా దుమ్ము ధూళి తో నిండిపోయింది. గదిని ఎందుకు మూసివేశారని సంబంధిత అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత గదిని సూపరింటెండెంట్ స్వయంగా చీపురు పట్టి ఊడ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గత కొంత కాలం నుంచి ఈ గది ని పూర్తిగా నిరుపయోగంగా మారిందని, ఈ గది కి ఉన్న తాళం ఎవరి దగ్గర ఉందొ సంబంధిత అధికారులకు కూడా సమాచారం లేకుండా పోయిందని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. బూజుపట్టిన గది లో బ్యాటరీ లు ఉన్నాయని షార్ట్ సర్క్యూట్ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అందువల్ల వెంటనే గది ని పరిశుభ్రం చేసి అందుబాటులో తీసుకుని వస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ గదిని నర్సింగ్ సిబ్బందికి కేటాయించినట్లు అయన చెప్పారు. ఆసుపత్రి లో పని చేసే సిబ్బంది పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలని లేనిపక్షం లో జరగరానిది జరిగితే ప్రమాదం ముంచుకోస్తోందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరు తీసుకోవాలని అయన అన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

గుంటూరు, పల్నాడు జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం గుంటూరు జిల్లాలో 27,753 మందికిగాను 27,169 మంది (97.89శాతం) హాజరయ్యారు.584 మంది గైర్హాజరయ్యారు. స్క్వాడ్స్ 76 సెంటర్లను సందర్శించాయి. పల్నాడు జిల్లాలో 25423 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 24931 మంది (98.06 శాతం) హజరయ్యారు. 492 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పల్నాడు జిల్లా విద్యా శాఖాధికారి ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. పల్నాడు జిల్లాలో సార్వత్రిక విద్యా పీఠం కింద 10 వ తరగతి పరీక్షలకు 1117 మంది విద్యార్థులకు గాను 1009 హాజరయ్యారని 108 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 62 మంది స్క్వాడ్, 86 మంది ఫ్లయింగ్ స్క్వాడ్, ఏడుగురు జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రెండు నెలలు దాటుతున్నా దక్కని పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. ప్రమాద బీమాను రైతులకు వర్తింపజేసేలా జాయింట్ కలెక్టర్ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ రంగం ఇప్పటికే సంక్షోభంలో కూరుకుపోయి, రైతులు అప్పులు పాలవుతున్నారని గుర్తు చేశారు. రూ.లక్షల పెట్టుబడులు పెట్టి, పంటను ధరొచ్చాక అమ్ముకోవడానికి కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకొని, అద్దెలు కట్టలేక రైతులు సతమతం అవుతున్నారని చెప్పారు. రైతుల కష్ట, నష్టాలను అధికారులు, ప్రభుత్వం గుర్తించాలని, బాధితులను ఆదుకునేందుకు ప్రస్తుత పసుపు ధర ప్రకారం నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, న్యాయవాది కొండూరు వీరయ్య, మేధావి రవికుమార్, రైతు సంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, బాధిత రైతుల సంఘం కో-కన్వీనర్ ఎం.శివసాంబిరెడ్డి, రామస్వామి, రైతు సంఘం నాయకులు డి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

యథేశ్చగా కోడ్ ఉల్లంఘన

(మొదటి పేజీ తరువాయి)

సొంత శాఖకు వెళ్లిపోవాల్సి ఉన్నా చాలా మంది కొనసాగుతున్నారు. గుంటూరు కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ల వద్ద ఉన్న ఉద్యోగులను తక్షణం కార్పొరేషన్ కార్యాలయంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ చేకూరి కీర్తి ఇచ్చిన ఆదేశాలను కింది స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు అమలు చేయడంలేదు. గుంటూరు మేయర్ వద్ద పనిచేస్తున్న ఉద్యోగి చిలకలూరిపేటలో పోటీ చేస్తున్న కావటి మనోహర్ నాయుడుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని అక్కడి టిడిపి నాయకులు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత ఉద్యోగి నిత్యం ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నారని కార్పొరేషన్ అధికారులు గుర్తించినా ఇంత వరకు చర్యలు లేవు. ప్రభుత్వ వాహనాలను ఉపయోగించే ప్రజా ప్రతినిధులు వద్ద నుంచి డ్రైవర్లను, అటెండర్లను ఉపసంహరించాల్సి ఉన్నా వారూ కొనసాగుతున్నారు. వ్యక్తిగత కార్యదర్శులు (పిఎస్), వ్యక్తిగత సహాయకులు (పిఎ), ఓఎస్‌డిలను మాతృశాఖకు పంపాల్సిన ఉన్నతాధికారులు ఈ అంశంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు.

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



గుర్తు తెలియని వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సత్తెనపల్లి రైల్వేస్టేషన్ పరిధిలోని భీమవరం రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఆమె వయసు అరవై ఏళ్లకుపైగా ఉంటుందని, నాలుగున్నర అడుగుల ఎత్తు, చామనఛాయ రంగులో ఉంది. ఆమె కుడి చేతిమీద రామచంద్రమ్మ పచ్చ బొట్టు ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వివరాలకు 7993507979 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇంజనీరింగ్ కళాశాలలో వసతుల పరిశీలన

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పొన్నూరు అసెంబ్లీ నియోజక వర్గానికి కేంద్ర బలగాలు రప్పించారు. బుధవారం కేంద్ర పోలీసు బలగాలకు చింతలపూడి ఇంజనీరింగ్ కాలేజీలో చేసిన వసతి ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి పర్యవేక్షించారు. వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పొన్నూరు పట్టణ, రూరల్ సిఐలు భాస్కర్, కోటేశ్వంరావు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చింతలపూడి ఇంజనీరింగ్ కాలేజీలో వసతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి

కారులో తరలిస్తున్న బంగారం స్వాధీనం

ప్రజాశక్తి-తాడికొండ



సరైన పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న 770 గ్రాముల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో తాడికొండ అడ్డరోడ్డు కూడలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద బుధవారం తనిఖీలు చేశారు. గుంటూరు నుండి తాడికొండ బ్యాంక్‌కు ఈ బంగారాన్ని తరలిస్తున్నట్లు తనిఖీ అధికారులు గుర్తించారు. గుంటూరుకు చెందిన కొండూరి శివకుమార్‌రెడ్డి తాడికొండ బ్యాంకులో తనఖాపెట్టుకునేందుకు తరలిస్తున్నట్లుఅధికారులకు చెప్పారు. తగిన పత్రాలు లేకపోవడంతో ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

పిల్లల వ్యాక్సినేషన్ సెంటర్లను తనిఖీ

ప్రజాశక్తి-మంగళగిరి



స్థానిక గణపతినగర్‌లోని ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని జాతీయ వ్యాధి నిరోధక టీకాల సెంటర్లను బుధవారం ఢిల్లీ నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ఇమ్మునైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ఆయుషీ తనిఖీ చేశారు. రెండో వార్డు సచివాలయం, శ్రీ రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళా వేదికలోని చిన్న పిల్లల జాతీయ వ్యాధి నిరోధక టీకాల సెంటర్లను తనిఖీ చేశారు. టీకాలు వేయించుకున్న పిల్లల జాబితాను పరిశీలించారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూషను అడిగి వివరాలు తెలుసు కున్నారు. అనంతరం ఇందిరానగర్ యుపిహెచ్‌సిని పరిశీలించారు.

కెఎల్‌యులో ముగిసిన ఫిలిం ఫెస్టివల్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో లలిత కళల విభాగం సినీఫిలియా సందర్భంగా నిర్వహించిన ఫిలిం ఫెస్టివల్ వేడుకలు బుధవారం ముగిశాయి. చిత్ర పరిశ్రమ నిపుణులు, చిత్ర నిర్మాతలు, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లలిత కళల విభాగం విద్యార్థులకు చిత్ర పరిశ్రమ గురించి అవగాహన కల్పించారు. యూనివర్శిటీ క్యాంపస్‌లోని జాస్మిన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల నుంచి వచ్చిన అతిథులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకాంత్ రూపొందించిన ఫొటో బుక్ ను యాడ్ ఫిల్మ్ డైరెక్టర్ బెంజమిన్ గైని, అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్ అభిసంగలు విడుదల చేశారు. వారు తమ నైపుణ్యం, అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ, ఫొటో జర్నలిజం ప్రాముఖ్యతపై శ్రీకాంత్ ప్రసంగించారు. వర్ధమాన చలనచిత్ర నిర్మాతల విభిన్న ప్రతిభను మరియు సృజనాత్మ కతను ప్రదర్శించే షార్ట్ ఫిల్మ్‌ల ప్రదర్శనలకు హాజరైన వారిని అభినందించారు. అనంతరం సినిమాటోగ్రఫీ, లైటింగ్ టెక్నిక్‌లలోని చిక్కులను పరిశోధించి, ఔత్సాహిక చిత్ర నిర్మాతలకు విలువైన సలహాలను అభి సంగ అందించారు. ఈ సందర్భంగా లలితకళల విభాగం రూపొందిం చిన 'పేజెస్ టు పిక్చర్స్' పుస్తకావిష్కరణను విద్యార్థుల ప్రోగ్రెషన్ , స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్ ఆవిష్కరించారు. ఈ ప్రచు రణ దృశ్యమాన కథలు, ఫొటోగ్రఫీ ప్రపంచంలోకి వెళ్లాలని చూస్తున్న వారికి విలువైన వనరుగా ఉంటుం దని అన్నారు. బెంజమిన్ గైని అవుట్‌డోర్ ప్రొడక్షన్‌పై సాంకేతిక వర్క్‌షాప్ కు హాజరైన వారికి చలన చిత్ర నిర్మాణ కళలో ఆచరణాత్మక జ్ఞానం, అనుభవాలను పంచుకున్నారు.



'మాన్' పుస్తకం విడుదల చేస్తున్న డాక్టర్ ఎన్ బివి ప్రసాద్, సుభాష్ యలవర్తి



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	1,05,862
మిర్చి ఎగుమతి	:	1,15,271
మిర్చి నిల్వ	:	79,311

మిర్చి ధరలు


	రూపాయలలో
334	9,000 - 19,500
నెం.5	11,000 - 16,000
273	10,000 - 17,000
341	9,000 - 19,000
4884	10,000 - 16,000
సూపర్ 10	12,000 - 15,000
	నాన్ ఎసి
తేజ	8,000 - 21,000
బడిగి	9,000 - 19,000
దేవనూరు డీలక్స్	9,000 - 16,000
తాలుకాయలు	5,000 - 12,000



గన్నవరంలో నీటి నాణ్యత పరీక్షలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో మాచర్ల మండలం గన్నవరంలో నీటి నాణ్యత పరీక్షలను బుధవారం నిర్వహించి స్థానికులకు వివరించారు. బ్లాక్ కో-ఆర్డినేటర్ మాడెబోయిన గురుప్రసాద్ మాట్లాడుతూ నీటి నాణ్యత పరీక్షల వల్ల అనారోగ్య సమస్యలకు ముందుగానే చెక్ పెట్టొచ్చన్నారు. బోరు నీటిని తాగేవారంతా తొలుత వాటి నాణ్యతను పరీక్షించుకోవాలని సూచించారు. గ్రామంలో వాటర్ సెక్యూరిటీ బడ్జెట్ కసరత్తు చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఒక ఇంజక్షన్ బోర్‌వెల్, మూడు వాన నీటి పరిరక్షణ నిర్మాణాలు నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రవివర్మ, లక్ష్మణ్‌రావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విషజ్వరాలు రాకుండా చూడండి

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని పలు గ్రామాల్లో నెల నుండి ప్రజలు విష జ్వరాల బారిన పడి బాధపడుతున్నారని, దోమల ఉధృతితో అల్లాడుతున్నారని ప్రజా సంఘాల నాయకులు చేపట్టారు. దోమల నివారణ చర్యలతోపాటు జ్వరాలు ప్రభలకుండా జాగ్రత్తలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు క్రోసూరులోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం వినతిపత్రం ఇచ్చారు. కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ క్రోసూరు పంచాయతీ పరిధిలోని యర్రబాలెంలో ఇప్పుడే జ్వరాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో దోమలను అరికట్టడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై క్రోసూరు పంచాయతీ అధికారులకూ విన్నవించామని చెప్పారు. ఇప్పుడున్న జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కలిగించే విధంగా ప్రచారం చేయాలని, జ్వరాల బారిన పడటానికి గల కారణాలను తెలపాలని కోరారు. వైద్యాధికారి ఎన్.బాల అంకమ్మ భాయ్ స్పందిస్తూ వాతావరణంలో మార్పు వలన వచ్చే విష జ్వరాలు, దోమ కాటు వల్ల జ్వరాలు వస్తున్నాయన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రజలు ఎక్కువసేపు ఎండలో ఉండకూడదని, రోజుకు ఐదు లీటర్లకు మించి నీరు తాగాలని, జ్వరాల బారిన పడినవారు కొబ్బరి బొండం నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎక్కువగా తీసుకుంటూ, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. జ్వరం తగ్గిందని అశ్రద్ధ చేస్తే మళ్లీ వచ్చే ప్రమాదముందన్నారు. దోమతెరలు కుడా వాడాలన్నారు. ఈ అంశాలపై వైద్య సిబ్బందితో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని, జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలనూ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ యర్రబాలెం గ్రామ కార్యదర్శి ఐలం గోపాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గంటేల చిన్నప్ప, నీరుకొండ కొండయ్య, బత్తుల చిన్న కొండయ్య పాల్గొన్నారు.

జనం కోసం స్వరాజ్యం అవిశ్రాంత పోరాటం

ప్రజాశక్తి - సత్తెనపల్లి



మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి సభ పట్టణంలోని ఫణిదం సొసైటీ వద్ద ఐద్వా నాయకులు డి.విమల అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జి.రజిని, పట్టణ కార్యదర్శి జి.ఉమశ్రీ మాట్లాడుతూ భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం మల్లు స్వరాజ్యం ప్రాణాలకు తెగించి పోరాడారని, నైజాం నవాబు అరాచాకాలను అడ్డుకోవటం కోసం 12 ఏళ్లకే తుపాకి చేపట్టి దళ నాయకురాలిగా ఎదిగారని చెప్పారు. తన పాటలతో దళ సభ్యుల్లో ఉత్సాహాన్ని నింపడంతోపాటు ప్రజలల్లోనూ చైతన్యం తెచ్చేవారని గుర్తు చేశారు. ఎన్‌టి రామారావు సిఎంగా ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలను సమీకరించి మద్యాపన నిషేధం, మహిళలకు ఆస్తి హక్కు కోసం, మరుగుదొడ్ల నిర్మాణం కోసం పెద్ద ఎత్తున ఉద్యమించారని తెలిపారు. మహిళల స్థితిగతులు మెరుగవుతున్న నేటి దశలో మళ్లీ మహిళ అణచివేత దిశగా, సతీసహగమనం వంటి దురాచారాలు అమలైన కాలానికి సమాజాన్ని తీసుకెళ్లేందుకు కేంద్రంలోని బిజెపి యత్నిస్తోందని విమర్శించారు. మణిపూర్‌లో మహిళలపై ఇటీవల జరిగిన దారుణాలు బిజెపి నిర్వాకమేనని మండిపడ్డారు. ఆ విధానాలకు వ్యతిరేకంగా, మహిళల అభ్యున్నతి కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. తొలుత మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సభలో ఎం.జ్యోతి, ఎ.వీరబ్రహ్మం, జి.హనుమాయమ్మ, రమాదేవి, రమణ, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి సభ



అధికారులతో మాట్లాడుతున్న జెసి శ్యాంప్రసాద్



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సిఐ ఆవుల భాస్కర్

పోలింగ్ కేంద్రాల్లో జెసి పరిశీలన

ప్రజాశక్తి - రెంటచింతల

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యామ్ ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. కొన్ని కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, కొన్ని కేంద్రాలకు కిటికీలు సరిగా లేకపోవడంతో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సిఐ ఎ.భాస్కర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే ఒకసారి పరిశీలించామని, కొన్ని సమస్యలను తమ దృష్టికి రాగా పరిష్కారానికి బిఎల్వోలకు సూచించామని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచితంగా ఎంసెట్ శిక్షణ

ప్రజాశక్తి - మాచర్ల



స్థానిక రామాటాకీసు లైను వద్ద ఉన్న యాపిల్ ఐఐటి స్కూల్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత ఎంసెట్ కోచింగ్‌ను ప్రారంభించినట్లు పల్నాడు జిల్లా అధ్యక్షులు రాజు తెలిపారు. 45 రోజుల పాటు జరిగే ఎంసెట్ కోచింగ్ పూర్తిగా ఉచితమని వివరించారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు క్లాస్‌లు, తదనంతరం స్టడీ అవర్స్, మోడల్ ఎంసెట్ పరీక్షలు ఉంటాయన్నారు. స్టడీ మెటిరియల్ కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. గుంటూరు, విజయవాడలలో రూ.15వేలు పైబడి వ్యయం చేసే కోచింగ్‌ను మాచర్లలో ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ పొంది గతేడాది అత్యధిక సంఖ్యలో విద్యార్థులు క్వాలీఫై అయినట్లు గుర్తు చేశారు. ఆసక్తి గల విద్యార్థులు 7993100628 ఫోన్ నంబర్‌కు లేదా యాపిల్ ఐఐటికి వచ్చి ఉచిత ఆడ్మిషన్ పొందాలని సూచించారు. ఇప్పటికే జరుగుతున్న శిక్షణను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతిష్‌కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, చైతన్య పర్యవేక్షిస్తున్నారు.



ఎంపి శ్రీకృష్ణదేవరాయలను సత్కరిస్తున్న పత్తిపాటి పుల్లారావు, ఇతర టిడిపి నాయకులు

చిత్తశుద్ధితో పని చేయండి

శ్రేణులకు పుల్లారావు, శ్రీకృష్ణదేవరాయలు పిలుపు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రానున్న ఎన్నికల్లో గెలుపు అనివార్యమని, అందుకే పార్టీ శ్రేణులంతా చిత్తశుద్ధితో పని చేయాలని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పిలుపునిచ్చారు. ఎన్నికల సంసిద్ధతపై పండరిపురంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పుల్లారావు మాట్లాడుతూ చిలకలూరిపేటలో వైసిపి చేసిన అభివృద్ధి ఏమీ లేదని, పైగా టిడిపి చేపట్టిన పెండింగ్ పనులను వదిలేసిందని అన్నారు. ఐదేళ్లలో బైపాస్ కూడా పూర్తి చేయలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే వీటిని పూర్తి చేస్తామని చెప్పారు. జనసేన, బిజెపితో సమన్వయం చేసుకుంటూ ఇంటింటి ప్రచారం చేయాలని, యువతను సమీకరించాలని చెప్పారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తనకు వివాదాలు, ఘర్షణలంటే నచ్చవని, అభివృద్ధికే ప్రాధాన్యమిస్తానని చెప్పారు. వివాదాలకు తావివ్వకుండా అందర్నీ కలుపుకెళ్లేలా వ్యూహాలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు తన మార్కు అభివృద్ధిని చేసి చూపిస్తానన్నారు. ఈ సందర్భంగా మండలం కోమటినేనివారిపాలేనికి చెందిన సీనియర్ నాయకులు నల్లూరి సాంబశివరావు వైసిపిని వీడి టిడిపిలో చేరారు.

నాగవాణికి రాణి రుద్రమ దేవి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - వినుకొండ



మార్క్ష్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన మహిళా దినోత్సవాల్లో వినుకొండ పట్టణానికి చెందిన అబ్దుల్ కలాం థెరిస్సా సేవా సొసైటీ వ్యవస్థాపకులు చందోలు నాగవాణి 'రాణి రుద్రమ దేవి' జాతీయ ఉత్తమ మహిళ సేవ పురస్కారాన్ని అందుకున్నారు. మిస్ ప్లానెట్, మిస్ ఏషియన్ ఇంటర్నేషనల్ రష్మీ ఠాకూర్ నుండి సత్కారం పొందారు. వినుకొండ పరిసర గ్రామాల్లో వెనుకబడిన విద్యార్థులకు ఉచితంగా లవ్ అండ్ కేర్ ట్యూషన్ కేంద్రాలను నాగవాణి నిర్వహిస్తూ వెయ్యి మందికిపైగా పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పరీక్ష పత్రాలను ప్రతిఏటా ఉచితంగా అందిస్తున్నారు. పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీతోపాటు మోటివేషనల్ తరగతులు నిర్వహిస్తున్నారు. పేదలకు అన్నదానం, దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేస్తున్నారు. బడికి వెళ్లని చిన్నారులను గుర్తించి అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, రక్తహీనత, ఇతన అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ సేవలకు గుర్తింపుగా తాజాగా పురస్కారాన్ని నాగవాణి అందుకున్నారు. ఈ సందర్భంగా నాగవాణి మాట్లాడుతూ ఆడపిల్లను చదివిస్తే ఆమె తన కుటుంబం పురోభివృద్ధికి, స్త్రీ అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నా ఇప్పటికే బహుముఖాలుగా హింసలకు గురవుతున్నారని, మహిళ సాధికారత ఎంతో అవసరమని చెప్పారు. స్త్రీ లేనిదే సమాజం లేదనే విషయాన్ని పురుషులూ గుర్తించాలని సూచించారు.

ప్రజాశక్తి
గుంటూరు 5
గురువారం 21 మార్చి 2024

అధికార, ప్రతిపక్ష పార్టీల తీరుతో రాష్ట్రానికి నష్టం : వి.కృష్ణయ్య



మాట్లడుతున్న వి కృష్ణయ్య

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కేంద్రానికి లొంగిపోవడం వల్ల రాష్ట్రానికి న్యాయం రావాల్సిన పన్నుల వాటా రూ.20 లక్షల కోట్లు నష్టపోయామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. బుధవారం రాత్రి తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో సిపిఎం పట్టణ విస్తృత సమావేశంలో కొట్టె కరుణాకరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపికి ఎందుకు మద్దతు పలుకుతున్నారో వైసిపి, టిడిపి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వనందుకా, నిరుద్యోగం పెరిగినందుకా సూటిగా సమాధానం చెప్పాలన్నారు. మోడీ మళ్లీ ప్రధాన మంత్రి అవుతారని టిడిపి, జనసేన కూటమి చెప్పడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నల్లడబ్బు వెలికితీసి జన్‌ధన్ ఖాతాల్లో వేస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన బిజెపికి ఓటేయ్యాలో ప్రజలు ఆలోచించాలన్నారు. ఈ సారి మోడీ గెలిస్తే దేశంలో మళ్లీ ఎన్నికలు ఉండవని చెప్పారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఢిల్లీ రైతుల పోరాటంలో 700 మంది బలిదానం చేసినా ఇచ్చిన హామీలను మోడీ అమలు చేయలేదన్నారు. ఇటీవల రైతుల ఆందోళనల సందర్భంగా కాల్పులు జరిపి రైతుల ఉసురు తీసుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో మోడీ కూటమి జరిపిన సభలో ప్రధాన మంత్రి అధికార పార్టీని ఒక్క మాట కూడా అనకపోవడం పట్ల మ్యాచ్ ఫిక్సింగ్ అర్థమవుతుందన్నారు. సిఎఎపై రాష్ట్రంలోని అధికార పార్టీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో జగన్‌కు, ఇటు చంద్రబాబు కూటమికి ఓటెస్తే బిజెపికి ఓట్లేసినట్లేనని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు, జగన్ ఎవరు వచ్చినా రాష్ట్రాన్ని అన్ని విధాలా ముంచుతారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నేతాజీ మాట్లాడుతూ ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పన్నుపై వడ్డీ రాయితీని వినియోగించుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు : పన్ను బకాయి ఏకమొత్తంగా చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీ గడువు మరో 10 రోజులు మాత్రమే ఉన్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నగర ప్రజలు ఈ నెలా ఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితిని పొందాలని తెలిపారు.నగరంలో ఇంకా షుమారు రూ.65 కోట్లు పన్ను బకాయి ఉన్నదన్నారు. వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు పన్ను బకాయిదార్లకు పన్ను చెల్లింపుపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏప్రిల్ 1 నుండి పన్నుపై వడ్డీ యధావిధిగా ఉంటుందన్నారు. పన్నుపై వడ్డీ రాయితీ పొందేందుకు 10 రోజులే గడువు ఉన్నందున సెలవు రోజుల్లో కూడా జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతోపాటు, భారత్‌పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని148వ వార్డు సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు యధావిదిగా పనిచేస్తాయన్నారు. కావున జిఎంసికి ఆస్తిపన్ను, నీటిపన్ను, ఖాళీస్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్రతి బుధవారం ఫైలేరియా బాధితులకు ఉచిత వైద్యం

ఫైలేరియా, మలేరియా విభాగాలను సందర్శించిన డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి - తెనాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి టి మురళీకృష్ణ సుబ్బరాయణం బుధవారం తెనాలిలో పర్యటించారు. స్థానిక పద్మశాలిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అలాగే పాత ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలోని ఫైలేరియా, మలేరియా యూనిట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ది తెనాలి డబుల్ హార్స్ వారి సహకారంతో లెప్రా సొసైటీ, ఫైలేరియా యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో అవసరమైన వారికి స్వయం సంరక్షణ కిట్లను, పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి బుధవారం ఫైలేరియా రోగులకు క్లినిక్ నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ ఫైలేరియా, మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, మెదడు వాపు వ్యాధి, జికా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయని, వాటిని నియంత్రించడంలో జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీబీ జాన్, డాక్టర్ డి. కిషోర్ కుమార్, ఎఎంఓ సిహెచ్ ప్రభాకర్ రెడ్డి, మలేరియా ఫైలేరియా విభాగాల సిబ్బంది జి. రవికుమార్, ఎస్ ఉమా కాంత్, శివగణేష్, బాలచంద్రమౌళి, లెప్రా సొసైటీ ఫిజియోథెరపిస్ట్ పి.కె. కోస్ల, కోఆర్డినేటర్ ఎస్. రమణయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు టి ప్రసాద్, బి మల్లేశ్వర రావు, ఎం రత్నాకర్, షేక్ రషీద్, షేక్ బాషీద్ పాల్గొన్నారు.


పాదరక్షలను పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి, మురళీకృష్ణ

జీతాలు చెల్లించకుంటే రేపు కార్యాలయం ముట్టడి

గ్రీన్ అంబాసీడర్లు, పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ



ప్రజాశక్తి - ఫిరంగిపురం రూరల్

ఫిరంగిపురం గ్రామపంచాయతీ కార్మికుల బకాయి జీతాలు రేపటి లోగా చెల్లించకపోతే ఎల్లుండి గ్రామ పంచాయతీ కార్యాలయం ముట్టడి చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మె శిబిరం బుధవారం 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు తమ చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. కార్మికులకు మద్దతు ప్రటించిన వై నేతాజీమాట్లాడుతు ఫిరంగిపురం గ్రామపంచాయతీలో టెండర్ కార్మికులకు తొమ్మిది నెలల నుండి జీతాలు చెల్లించలేదని, గ్రీన్ అంబాసిడర్లకు 7 నెలల జీతాలు చెల్లించాలని, వీటిని చెల్లించాలని కోరుతూ గత పది రోజులుగా కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నా అధికారులు సమస్య పరిష్కారం చేయలేదని అన్నారు. కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించకపో వడంతో కార్మికులు అప్పుల పాలు అవుతున్నారని దీనివల్ల వచ్చే జీతాల్లో కొంత భాగం వడ్డీలకే పోతున్నదని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న పంచా యతీ కార్మికుల జీతాలు మాత్రం ఐదేళ్లుగా ఒక రూపాయి కూడా పెంచలేదని కార్మికుల కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నుండి పంచాయ తీలకు వచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమ బడ్జెట్లోకి మళ్లించు కోవడం వల్ల కూడా ఈ సమస్య ఉత్పన్నమవుతున్నదని అందువల్ల కార్మికుల కష్టాలకు రాష్ట్ర ప్రభుత్వా నిదే ప్రధాన బాధ్యతని అన్నారు. శుక్రవారం జరిగే గ్రామపంచాయతీ కార్యాలయం ముట్టడికి మండలం లోని అన్ని కార్మిక సంఘాలు ఉద్యోగ సంఘాలు ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి ఎస్.కె మస్తాన్వలి గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ రామా రావు, ఇబ్రహీం, శ్రావణ్, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

తల నీలాలు వేలం నిర్వహించాలి

దేవస్థానం ఇఒకు ప్రజాసంఘాల నాయకుల వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో యాత్రికులు తలనీలాలు సమర్పిస్తారని వాటికి వేలం పెట్టాలని 27వ వార్డుకు చెందిన కె.నరసింహరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు బుధవారం దేవస్థానం ఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ పాట ద్వారా దేవస్థానమునకు ఆదాయం లక్ష రూపాయల వరకు వస్తుందని తెలిపారు.2018 సంవత్సరం వరకు పాట జరిపారని, గత ఆరు సంవత్సరాల నుండి పాటలు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. దీనివలన దేవస్థానా నికి వచ్చే ఆదాయం తగ్గిపోయిందని విన్నవించారు. ఈ ఆదాయాన్ని ప్రైవేటు వ్యక్తులు అనుభవిస్తున్నారని చెప్పారు. అందువలన వెంటనే పాట నిర్వహించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రికి, దేవాదాయ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి నాగేశ్వరరావు, పి నాగరాజు, పి రామచందర్రావు, జె కోటయ్య, ప్రజాసంఘాల నాయకులు జెవి రాఘవులు, ఎస్ ఎస్ చంగయ్యా, పి బాలకృష్ణ, వై కమలాకర్, ఎం బాలాజీ పాల్గొన్నారు.


ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరిలో కంట్రోల్ రూం ఏర్పాటు

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం 87- మంగళగిరి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో జరిగే ఎన్నికలకు సంబంధించి ఓటర్లు, ప్రజలు, సూచనలు, సలహాలు, ఫిర్యాదులు ఇవ్వడానికి ఎన్నికల అధికారులు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఫోన్ నెంబర్స్ 08645233500, 08645233501 తెలిపారు.


పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జెసి రాజకుమారి

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన రిటర్నింగ్ అధికారి

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి నాలుగవ సెక్టార్లో 10 పోలింగ్ కేంద్రాలను, మంగళగిరి 16వ సెక్టార్లో 16 పోలింగ్ కేంద్రాలను, 20వ సెక్టార్లో 9 పోలింగ్ కేంద్రాలను బుధ వారం మంగళగిరి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, తాగునీటి సరఫరాకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. లేని కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి తాసిల్దారు కే వెంకటేశ్వరరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి తెనాలి

పురపాలక సంఘం, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘం కార్యాలయం నుంచి శివాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఈ సంధర్భంగా కమిషనర్ శేషన్న మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకమని, దానిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరునికి భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందన్నారు. ఒన్ టౌన్ సిఐ దశరథ రామయ్య మాట్లాడుతూ ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ప్రలోభాలకు ప్రభావితం కాకుండా ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

అనుమతి పొందిన గ్లో-బోర్డులు తొలగించలేదు : కమిషనర్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మున్సిపల్ కార్యాలయం పరిధిలోని అనుమతి పొందిన గ్లో- బోర్డులను తొలగించలేదని నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం పరిధిలోని వాణిజ్య, వ్యాపార పరిధిలో 167 గ్లో- బోర్డులు మాత్రమే అనుమతి పొందాయన్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955 సెక్షన్ 622(2), 420, 421 ప్రకారం మున్సిపల్ కార్యాలయం నుండి లేదా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 63, జీవో 326 ప్రకారం వ్యాపార నిమిత్తం మాత్రమే గ్లో- బోర్డులు, వాల్ పెయింట్ లు అనుమతిం చబడతాయన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా ఏమైనా గ్లో-బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేసుకోనదలచిన వారు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్‌ల నుండి రాతపూర్వకంగా అనుమతి పొందాలన్నారు. అనుమతులకు దరఖాస్తులు చేసిన వారికి ఎన్నికల నిబంధనలకు లోబడి అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు.

ప్రతికూల వార్తలపై తక్షణమే స్పందించాలి : కలెక్టర్

ఎన్నికల సంబంధిత అధికారులకు కలెక్టర్ శివశంకర్ ఆదేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా దినపత్రికలలో వస్తున్న ప్రతికూల వార్తలపై తక్షణమే స్పందించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం నుండి ఎన్నికల నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మండల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో, బహిరంగ ప్రదేశాలలో ఉన్న రాజకీయ నాయకుల చిత్రాలను, ప్రభుత్వ కార్యక్రమాలపై ఉన్న పోస్టులను తొలగించాలని ఆదేశించారు. సి-విజిల్ యాప్ పనితీరును పరిశీలించారు. ఈ యాప్‌లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. సమస్యలు ఏమైనా ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సువిధ , ఎన్‌కోర్ యాప్‌లగురించి అవగాహన కల్పించారు. పెండింగ్‌లో ఉన్న క్లైములను సకాలంలో పరిష్కరించాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రదేశాలలో అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లకు జిపిఎస్ అనుసంధానం జరిగిం దని, చెక్ పోస్ట్‌ల వద్ద సిసి కెమెరాలు అను సంధానం చేసినట్టు వివరించారు. రిటర్నింగ్ అధికారులు రోజువారీ నివేది కలు పంపాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జిల్లా రెవెన్యూ అధికారి

పేదల బియ్యం పక్కదారి

ఎండియు వాహనదారులపై లబ్ధిదారుల ఆరోపణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా యంత్రాంగం మొత్తం ఎన్నికల హడావుడిలో ఉన్న నేపథ్యంలో సందట్లో సడేమియాలా రేషన్ అక్రమ వ్యాపారులతో ఎండియు వాహనదారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో పూర్తిస్థాయిలో రేషన్ సరఫరా చేయకుండా వాటిని నల్లబజారుకు తరలిస్తున్నట్లు ఆరోపణలు. జిల్లా అధికారులు నిత్యం తనిఖీలు చేస్తున్నా సరఫరా తీరును ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నప్పటికీ రేషన్ అక్రమార్కులకు అడుకట్ట వేయలేకపోతున్నారని లబ్ధిదారుల నుండి విమర్శలు వస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో 2 నెలలుగా రేషన్ సరఫరా చేయడం లేదని పేదల బియ్యాన్ని సక్రమంగా సరఫరా చేయడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పథకానికి రేషన్ డీలర్లు, ఎండియు వాహనదారులు తూట్లు పొడుస్తున్నారు. లబ్ధిదారులకు అందజేస్తున్న బియ్యంలో కోత విధిస్తూ జేబులు నింపుకుంటున్నారు. పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎన్నికల హడావుడిలో ఉండడంతో ఎవరు పట్టించుకోరనే ధైర్యంతో ఈవిధంగా చేస్తున్నారు.



రేషన్ పంపిణీ తీరును ఆకస్మిక తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ (ఫైల్)

ప్రభుత్వం ఏర్పాటు చేసిన బియ్యం పంపిణీ చేసే వాహనదారులే దారి మళ్ళిస్తున్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి వద్దకే రేషన్ హామీ అమలు కావడం లేదని, లబ్దిదారుల ఇళ్ల వద్దకు వచ్చి బియ్యం సరఫరా చేయకుండా వాహనాన్ని ఒక చోట నిలపడంతో అక్కడికే లబ్దిదారులు వెళ్లి రేషన్ తీసుకోవాల్సి వస్తోంది. ప్రతి లబ్దిదారునికి బియ్యం తగ్గించి ఇస్తున్నారని లబ్దిదారులు వాపోతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తమకు బియ్యం తక్కువగా వస్తున్నాయని, అందుకే, తగ్గించి ఇస్తున్నామని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. డీలర్లకు కమిషన్ ఇస్తున్నా బియ్యంలో కోత పెడుతున్నారని లబ్దిదారులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు

పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మరో రెండు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా బహుమతులు, తాయిలాలు పంపిణీ చేసే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పన్నుల జాయింట్ కమిషనర్ నాగజ్యోతి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లా లకు చెందిన అభ్యర్థులు ఎవరైనా ఓటర్లకు బహుమతులు అందిస్తున్నారనే సమాచారం ప్రజల దృష్టికి వస్తే తక్షణమే పన్నుల శాఖకు చెందిన 9154970445కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ప్రజాశక్తి-ఈపూరు: సార్వత్రిక ఎన్నికలలో ఎటు వంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంత వాతా వరణంలో ఎన్నికలు జరిగేలా గ్రామ ప్రజలు సహ కరించాలని వినుకొండ రూరల్ సిఐ యు.సుధాకర్ అన్నారు. మండలంలోని ఇనిమెళ్ళ, ముప్పాళ్ళ గ్రామాల్లో ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా సిఐఎస్ఎఫ్ బలగాలతో గ్రామ ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించినట్లు సిఐ చెప్పారు. సిఐతో పాటు ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్, ఎఎస్ఐ సాంబయ్య ఉన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిఐ యు.సుధాకర్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సులువుగా లక్ష్యసాధన

డాక్టర్ బుద్దా చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మానవ ఆలోచనలు ఎన్నో రకాల సూపర్ కంప్యూటర్లను తయారు చేసే జ్ఞానం గలదని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని డాక్టర్ బుద్దా చంద్రశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని ఐక్యూఏసి సెల్ ఆధ్వ ర్యంలో బుధవారం 'విద్యారంగంలో ఆధునిక సాంకేతిక సాధనం' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఐక్యుఎసి డైరెక్టర్ ఆచార్య సంధ్యకోలే అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యూఢిల్లీలోని ఎఐసిటిఇ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం లోనే మొట్ట మొదటిగా అనువదిని అనే సాఫ్ట్వేర్ టూల్‌ను భారతదేశం రూపొం దించింది అని పేర్కొన్నారు. ఈ టూల్ వినియోగించి వీడియోలను ఒక భాష నుంచి మరొక భాషకు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి సాధనం ద్వారా అనుకున్న ఫోటోలను క్రియేట్ చేసుకోవడం, పిడిఎఫ్ రూపంలో ఉన్న పుస్తకాలను ఇతర భాషల్లోకి తర్జుమా చేయటం, ఇతర భాషల్లో ఉన్న వీడియోలను మనకు నచ్చిన భాషలోకి మార్చుకోవడం వంటివి సులభంగా చేసుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020కు **అనువదిని** టూల్ ఎంతో ఉప యోగకరంగా ఉంటుందన్నారు.

ప్రపంచంలోనే భారతదేశం రూపొందించిన ఈ యూనివర్సల్ టూల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను మించిన కంటెంట్ ను అంది స్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ టూల్ ను వినియోగించి అవసరమైన లక్ష్యాలను త్వరితగతిన చేరుకోవచ్చని చెప్పారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న వీసీ ఆచార్య పి. రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. నూతనంగా కెరియర్ లాంజ్‌ను ప్రారంభించామని ఇందులో విద్యార్థికి సంబంధించిన బయోడేటాను సమర్పించినట్లయితే అతని అర్హతలకు తగ్గ ఉద్యోగాలకు విశ్వవిద్యాలయమే దరఖాస్తు చేసుకునే వీలు కల్పిస్తుందన్నారు. తద్వారా కోర్సు పూర్తిచేసుకుని వెళ్లే లోగా ఉద్యోగంతో పొందే ఆలోచనను విశ్వ విద్యాలయం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. భవిష్యత్తులో స్థిరపడిన విద్యార్థులు వర్సిటీ కీర్తి ప్రతిష్టలు పెంచేలా ఎదగాలన్నారు. సంధ్యకోలే మాట్లాడుతూ ఉన్నత విద్యా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్, బిగ్ డేటా ఎనాలసిస్ వంటి రంగాలు ప్రత్యేక పాత్రను పోషిస్తున్నాయన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని లక్ష్యాలను సాధించాలని అన్నారు. సమావేశంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిద్దయ్య , ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాసరెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ప్రమీలారాణి, ఐక్యూఏసి అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ గోపికృష్ణ పాల్గొన్నారు.





ప్రచారంలో నంబూరు శంకరరావు, అనిల్‌కుమార్‌యాదవ్

'పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం'

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నర్సరావుపేట పార్లమెంటు అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. బెల్లంకొండ అడ్డరోడ్డు వద్ద నుండి నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ, చంద్రాజుపాలెం, వన్నాయ పాలెం, కందిపాడు, క్రోసూరు మండలం ఆవులవారిపాలెం ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో శంకరరావు మాట్లాడుతూ పెదకూర పాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్తిమళ్ల రమేష్

ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడులో ముస్లిం మైనార్టీ ముఖ్యనేతలతో బుధవారం తెలుగుదేశం పార్టీ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. మైనార్టీల సంక్షేమం కోసమే చంద్రబాబు నాయుడు హయాంలో రంజాన్ తోఫా, దుల్హన్ పథకాలు, ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు, షాదీ ఖానాల నిర్మాణాలు, ప్రార్థనా మందిరాల నిర్మాణాలకు నిధులు ఇచ్చారని గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో ముస్లింలకు రాజకీయ పదవులు ఇచ్చి వారు ఎదుగుదలకు బాటలు వేశారన్నారు. ఓటింగ్ పెంపు దలకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ ముస్లిం మైనారిటీ నాయకులు మౌలాలి, ముంతాజ్, అజిముల్లా, మలాట్ రఫీ మస్తాన్ షరీఫ్ , షబ్బీర్, మునీర్, హనీఫ్, పర్వేజ్ పాల్గొన్నారు.



నివాళులర్పించి.. గౌస్ కుటుంబసభ్యులో మాట్లాడుతున్న పుల్లారావు

గౌస్ పార్థివ దేహానికి ప్రత్తిపాటి నివాళి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక 10వ వార్డుకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త షేక్ గౌస్ (64) మృతిపై మాజీమంత్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం గుర్రాలచావిడిలోని నివాసంలో గౌస్ పార్థివ దేహాన్ని పుల్లారావు సందర్శించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పుల్లారావు మాట్లాడుతూ గౌస్ మృతి పార్టీకి తీరని లోటని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - దుగ్గిరాల

2024 ఎన్నికలు దిశ దశ చేరబోతున్న క్రమంలో బిజెపి కబంధ హస్తాల నుండి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకర్ అన్నారు. మండల కేంద్రంలో దుగ్గిరాలలో బుధవారం సిపిఎం విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాల రాస్తుందని రాష్ట్ర హక్కులను హరిస్తుందని విమర్శించారు. మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు సీసీఏ ప్రవేశపెట్టిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా ఇండియా వేదిక ఏర్పడినదని, ఇండియా వేదిక సభ్యుల్ని గెలిపించుకోవాలని పిలుపిచ్చారు. కార్మికుల, రైతాంగ హక్కులను కాపాడుకునేందుకు మంగళగిరి నియోజకవర్గం నుండి సిపిఎం పోటీ చేయబోతుందన్నారు. త్వరలో అభ్యర్థిని ప్రకటిస్తారని తెలిపారు. సిపిఎంను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దుగ్గిరాల ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. హై లెవెల్ ఛానల్‌కు రూ.కోటి కేటాయిస్తే పూర్తవుతుందని కానీ ప్రస్తుత ప్రభుత్వం ఒక కోటి రూపాయలు కేటాయించలేకపోయిందనీ విమర్శించారు. రబీలో కాలువలు ఎండిపోయాయని, బోర్లలో నీళ్లు రావడం లేదన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో బకింగ్ హామ్ కెనాల్ పక్కన విచిత్రమైన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పంట


మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

కాలువలు రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఎండాకాలం రాకముందే కాలువలు మరమ్మతు చేయాలన్నారు, డెల్టా అభివృద్ధికి కేటాయించిన నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. పంటలకు మద్దతు ధర ప్రకటించాలని రుణమాఫీ చేయాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు పేద రైతులకు 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, మండల నాయకులు వై బ్రహ్మేశ్వర రావు, జే బాలరాజు, జి యోహాను ఎన్ యోగేశ్వరరావు, బి అమ్మిరెడ్డి, ఏ శ్రీనివాసరావు సిహెచ్ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల జీవితాలతో రాజకీయాలు చేయొద్దు

ప్రజాశక్తి - మంగళగిరి :స్వర్ణకారుల జీవితాలతో రాజకీయాలు చేయొద్దని గుంటూరు జిల్లా స్వర్ణకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అన్నారు. మంగళగిరి పట్టణంలోని షరాఫ్ బజారులో బుధవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ స్వర్ణకారుల కార్పొరేషన్ కొరకు గత ప్రభుత్వ హయాంలో కూడా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో 14 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేయడం జరిగిందని పారేపల్లి తెలిపారు. ఆనాడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మీదట దీక్షను విరమించడం జరిగిందని చెప్పారు. ఆ తరువాత రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

చెప్పారు. మరల స్వర్ణకారుల కార్పొరేషన్ కొరకు జిల్లా స్వర్ణకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజకీయాలకతీతంగా రిలే నిరాహార దీక్షలు చేయడం జరిగిందని చెప్పారు.అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వం నుండి సర్క్యులేషన్ కాపీని తీసుకువచ్చారని, ప్రభుత్వం వస్తే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జీవో వచ్చినట్లుగా నేను చెప్పలేదని తెలిపారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా స్వర్ణకారుల కార్పొరేషన్ వంద రోజుల్లో ఏర్పాటు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష కు పూనుకుంటానని హెచ్చరించారు.తనపై వ్యంగ్యంగా మాట్లాడిన స్వర్ణకారులు నాయకులు ఆమరణ నిరాహార దీక్షకు మీరు కూడా కలిసి వస్తారా అని ప్రశ్నించారు.తాను ఎప్పుడూ స్వర్ణకారుల సంక్షేమం గురించే పోరాటం చేస్తున్నానని తెలిపారు. ఈ సమావేశంలో స్వర్ణకారుల సంక్షేమ సంఘం నాయకులు జై వరప్రసాద్, యు నరేంద్ర, డి నారాయణ, కే ధనుంజయ్ రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి :గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రకాష్‌నగర్, డోలాస్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిఇ అక్కల సత్యనారాయణ, ఎఇ షణ్ముఖ రావు తెలిపారు. మరమ్మతుల సందర్భంగా జరుగుతున్న ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.



సీనియర్ సిటిజన్లను ఆదరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

సీనియర్ సిటిజన్ల జీవితానుభవాలను ప్రభుత్వాలు, సమాజం, కుటుంబాలు ఎంత వినియోగించుకుంటే ఆ సమాజం, ప్రభుత్వాలు ఆరోగ్యకరమైన దిశగా నడుస్తాయని జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బైసాని కైలాసనాద్ పేర్కొన్నారు.అసోసియేషన్ నాల్గవ సర్వసభ్య సమావేశం స్థానిక ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజనులకు ఆక్సిలేట్ ల్యాబ్స్ సహకారంతో పూర్తి రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన కైలాస్‌నాథ్ మాట్లాడుతూ 2007 వయోవద్ధుల తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టాన్ని ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేసేల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజెన్ల రైల్వే కన్సెషన్‌ను పునరుద్ధరించాలని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆర్టీసీ బస్సులలో 25 శాతం ఉన్న ప్రయాణ రాయితీ 50శాతంకు పెంచాలని కోరారు. వద్ధాప్య పెన్షన్ను రూ.3వేల నుండి రూ.5వేలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యు. వి.వి.సాగర్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఏ.ఎం.జి.ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, కోశాధికారి కె.కామేశ్వరరావు, సలహాదారు వల్లూరి సదాశివరావు, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్నా తెలుగు దేశం పార్టీ నాయకులు

వైసిపి దాడికి టిడిపి ఖండన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రామాంజనేయులు పై జరిగిన దాడిని ప్రత్తిపాడు తెలుగు దేశం పార్టీ నాయకులు మీడియా సమావేశంలో ఖండించారు. మండల కన్వీనర్ గింజుపల్లి శివరంప్రసాద్ మాట్లాడుతూ ఎలక్షన్ లో వలంటీర్లు పాల్గొన్నకుడదు అని చెప్తుంటే వైసిపి ఇంచార్జ్ రహస్యంగా మిటింగ్‌లు పెట్టి ఓటర్లను ప్రబవితం చేసెల చూస్తున్నారన్నారు. అ విషయలను రామాంజనేయులు తెలుసుకొని అడగటానికి వెళ్తే అక్కడ వైసిపి నాయకులు దాడి చేశారని, ఇది విజవాడ కాదు ప్రత్తిపాడు ప్రజలు తీరగబడితే విజయవాడ వెళ్తారని హెచ్చరించారు. రామాంజనేయులు ద్వార వలంటీర్లు లను ఎలక్షన్ కి దూరంగా ఉండేలా చేస్తామని తెలిపారు. తెలుగు యువత నాయకులు చిన్నం శ్రీకాంత్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ చెప్పిన ఎందుకు అదికారులు నీలవరించటలేదు ప్రజల రక్షణ లేకుండ పోతుదన్నారు. బీసీ సెల్ నాయకులు భగత్ మాట్లాడుతూ వలంటీర్లు ఎలక్షన్ కమిషన్‌కి విరుద్దంగ పనిచేస్తున్నారని తెలిపారు. అందువలన విషమం తెలిసి రామాంజనేయులు వెళ్ళారని, దాడి చేయలని ఉద్దేశం తో వెళ్ళలేదన్నారు. కావలనే వైసీపి నాయకులు దాడి చేశారన్నారు. ప్రజలు వైసీపీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో మాజి జడ్‌పిటిసి భాగ్యారావు, మాజీ ఎంపిపి శ్రీనివాసరావు, వెలివెళ్లి సుబ్బారావు, ఎస్ సి సెల్ బసవ బాబు, తిక్కిరెడ్డి పాలెం సర్పంచ్ మాకినేని జగన్ నవీన్, మంద రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

అపార్టుమెంట్ వాసులతో ముఖాముఖి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్లలో బుధవారం నారా లోకేష్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. అపార్టుమెంట్ వాసుల ఇబ్బందులు తీరుస్తానని అన్నారు. తాను అధికారంలో లేకపోయినా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అపర్ణ, అమరావతి వన్ అపార్టుమెంట్ వాసులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యువత అడిగి అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

మంగళగిరి చేనేతకు పూర్వవైభవం : నారా లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో చేనేతకు పూర్వవైభవం తీసుకువస్తానని నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లిలోని నివాసంలో చేనేత సొసైటీల ప్రతినిధులతో బుధవారం లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... మంగళగిరి అంటేనే చేనేతకు ప్రసిద్ధి. ఒడిదుడుకుల్లో ఉన్న చేనేత రంగానికి చేయూతనిస్తాం. ఇప్పటికే మంగళగిరిలో వీవర్స్ శాల ఏర్పాటుచేసి ఉపాధి కల్పించడం జరిగింది. టాటా తనేరియాతో ఒప్పందం కుదుర్చుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాం. సరికొత్త డిజైన్స్ ను తీసుకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. అధికారంలోకి వచ్చాక చేనేతకు సబ్సీడీలు ఇచ్చి ప్రోత్సహిస్తాం. కొత్త మగ్గాలను తీసుకువచ్చి మార్కెట్ సదుపాయాలను పెంచుతాం తెలిపారు. కేంద్రంతో మాట్లాడి చేనేత రంగంపై జీఎస్టీ లేకుండా చేస్తాం. చేనేతలను ప్రైవేటు కంపెనీలతో అనుసంధానించి అవకాశాలను విస్తృత పరుస్తాం. ఆప్కోపై ఆధారపడకుండా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం అన్నారు. రాష్ట్రాభివృద్ధి, ఉద్యోగాల కల్పనలో వ్యాపారులు, రిటైల్ వ్యాపారలదీ కీలకపాత్ర



మాట్లాడుతున్న నారా లోకేష్

అన్నారు. సామాజిక సేవలో రోటరీ క్లబ్ సంస్థ సేవలు ప్రశంసనీయమని యువనేత నారా లోకేష్ కొనియాడారు. ఉండవల్లి నివాసంలో మంగళగిరి, తాడేపల్లి రోటరీ క్లబ్ ప్రతినిధులతో పాటు రెడ్ క్రాస్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. నేను, పెమ్మసాని చంద్రశేఖర్ కలిసి డబుల్ ఇంజన్ లా పనిచేస్తాం. భారీ మెజార్టీతో మమ్మల్ని గెలిపించాలని కోరారు. సమావేశాల్లో గుంటూరు పార్లమెంట్ నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

పెదరావూరులో టిడిపి జనసేన ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - తెనాలి, కొల్లిపర

రూరల్ గ్రామం పెదరావూరు, కొల్లిపర మండలంలో వల్లభాపురం మున్నంగి పిడపర్రు పిడపర్తి పాలెం కొల్లిపర తూమలూరు గ్రామాల్లో బుధవారం టిడిపి జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో ఆ పార్టీల ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని విధాల అధోగతి పాల యిందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం అనివార్యమని, ఐదు కోట్ల ఆంధ్రుల రాజధాని అమరావతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ ప్రయత్నంలో భాగంగానే వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం పొత్తులతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. దానితోపాటు తెనాలి ప్రాంతంలో గణనీయమైన అభివృద్ధికి కృషి చేస్తానని, ఎన్నికల్లో అంతా సహకరించాల్సిందిగా కోరారు. కొల్లిపర కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భీమవరం చిన్నకోటిరెడ్డి వంగాసామిరెడ్డి గుదిబండి గోవర్ధన్ రెడ్డి లంక కోటిరెడ్డి ఆళ్ల వీరారెడ్డి జనసేన మండల అధ్యక్షులు వెంకయ్య నాయుడు వేమవరపు వేణుగోపాల్ రెడ్డి భీమవరపు కిషోర్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్



మాట్లాడుతున్న సత్యనారాయణ

మనిషి సంతోషానికి సూచిక చిరునవ్వు

ప్రజాశక్తి-గుంటూరు

మనిషి జీవితంలో అంతిమ లక్ష్యం సంతోషంగా ఉండటం అని, ఆనందం వల్ల సానుకూల ధృక్పదం పెరిగి, సమస్యలను సులభంగా పరిష్కరించుకోలమని పలువురు సాహితీవేత్తలు, కవులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో అంతర్జాతీయ సంతోష దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ సంతోషంగా ఉండే వాళ్లలో ఆత్మ విశ్వాసం అధిక స్థాయిలో ఉంటుందని, కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని అనేక శాస్త్రీయ అధ్యయనాలు పేర్కొంటున్నాయన్నారు. నేటి ఆధునిక యుగంలో సంతోషం మనిషి నుండి రోజురోజుకూ దూరమైపోతుందన్నారు. తీవ్ర ఒత్తిడికి లోనై అనేక ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారన్నారు. హాస్యవల్లరి కోఆర్డినేటర్ వి.వి.రావ్ మాట్లాడుతూ సంతోషం ప్రాధాన్యతను గుర్తించిన మొదటి దేశం భూటాన్ అని, 1970 నుంచే సంతోష సూచికయే నిజమైన ఆరోగ్య సూచిక అని ప్రపంచానికి చాటిందన్నారు. భూటాన్ దేశంలో జాతీయ ఆదాయం కన్నా జాతీయ సంతోషానికి అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని 2013లో ఐక్యరాజ్యసమితి సంతోష ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా తెలియజేటానికి అంతర్జాతీయ సంతోష దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. గాయకుడు డి.టి.సాయిబాబు, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, సాహితీవేత్త ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సునీతకు ఔట్ స్టాండింగ్ ఉమెన్ రీసెర్చర్ అవార్డు


వర్సిటీ ఓఎస్‌డి సునీతను అభినందిస్తున్న విసి తదితరులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగంలో విస్తృత పరిశో ధనలు చేస్తున్నందుకు ఓఎస్‌డి, జువాలజీ- ఆక్వా కల్చర్ విభాగాధిపతి ఆచార్య కె. సునీత కు అవుట్ స్టాండింగ్ ఉమెన్ రీసెర్చర్ ఇన్ జువాలజీ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు తమిళనాడులోని వీనస్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్మెంట్ కేటగిరిలో అవార్డును ప్రకటించారు. వీనస్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ బోర్డు మేనేజ్మెంట్, వివా 2024 ఎక్స్‌ప ర్ట్ కమిటీ నివేదికతో పాటు అపెక్స్ కమిటీ సూచనలను పరిగణలోకి తీసుకొని ఈ అవార్డుకు సునీ తను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఓఎస్‌డి సునీతను విసి ఆచార్య పి. రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కే.గంగాధరరావు తదితరులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీనస్ ఇంటర్నేషనల్ ఫౌండే షన్ ఎన్నో సంవత్సరాలుగా ప్రతిష్టాత్మకంగా కార్యకలాపాలు కొనసాగిస్తుందని అన్నారు. అవుట్ స్టాండింగ్ ఉమెన్ రీసెర్చర్ అవార్డుకు ఎంపిక చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న రోజుల్లో తన పరిశోధనలు విస్తృతం చేసి విశ్వవిద్యాలయానికి మరింత ఉన్నతి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

సెయింట్ ఆన్స్‌లో వన్‌డే వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో మైండ్‌క్రాఫ్ట్ ఇంటర్నేషనల్ సంస్థ వారిచే డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థినులకు 'యాంగర్ మేనేజ్‌మెంట్ త్రో బిహేవియర్ టెక్నాలజీ' అనే అంశంపై వన్‌డే వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల యాజమాన్యం, ఐక్యూఎసి, స్టూడెంట్ సెమినార్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ మ్యాథ్ పెర్లీస్టెయిన్ సిఇఒ, కో-ఫౌండర్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విద్యార్థినులకు పాజిటివ్ మెంటల్ హెల్త్ టేకింగ్ కంట్రోల్ ఆఫ్ లైఫ్ అనే అంశంతో మనలోని భావోద్వేగాల నియంత్రణ ఎలా చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిలారి రోశయ్య, అప్పిరెడ్డి, అన్నాబత్తుని

పెమ్మసాని గెలిస్తే అమెరికా వెళ్లిపోతారు

అసెంబ్లీ అభ్యర్థులతో కలిపి కిలారి రోశయ్య విమర్శలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల్లో పోటీకి అమెరికా నుంచి దిగుమతి అయిన టిడిపి లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు గుంటూరు కారం ఘాటు చూపిస్తామని వైసిపి అభ్యర్థి కిలారి రోశయ్య హెచ్చరించారు. గుంటూరు లోక్ సభ పరిధిలోని ఏడుగురు అసెంబ్లీ అభ్యర్థులతో కలిసి ఆయన బుధవారం తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. అమెరికా లో ఉన్న తుపాకీ కల్చర్ ను గుంటూరులో అమలు చేయాలని టిడిపి పెమ్మసాని చంద్రశేఖర్ చూస్తున్నారని ఆరోపించారు. గతంలో రెండు సార్లు గెలిచిన ఎంపి గల్లా జయదేవ్ కనీసం ఒక్క రోజు కూడా నియోజక వర్గంలో ఉండలేదని, ఏటువంటి అభివద్ధి చేయలేదన్నారు. పెమ్మసానిని ప్రజలు ఇక మీదట అమెరికాకు ఫోన్లుచేయాల్సి వస్తుందన్నారు. గత ఐదేళ్లలో పొన్నూరునియోజకవర్గంలో గల్లా జయదేవ్ ఒక్కరోజు కూడా పర్యటనకు రాలేదన్నారు. నియోజకవర్గం ప్రజలను గాలికి వదిలేశారని తెలిపారు. తాను పక్కా లోకల్ అభ్యర్థిని అని టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్ర శేఖర్ గెలిస్తే అమెరికా వెళ్లి పోతారని అన్నారు. గుంటూరు లోక్ సభ పరిధిలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు కి కషి చేస్తానని ఆయన చెప్పారు. వైసిపి లో కాపులకి అధిక ప్రాధాన్యత ఇస్తూ సీఎం జగన్ సామాజిక న్యాయం చేశారని అన్నారు. సమావేశంలో వైసిపి అభ్యర్థులు విడదల రజనీ, అన్నాబత్తుని శివకుమార్, మురుగుడు లావణ్య, అంబటి మురళి, నూరి ఫాతిమా, బాలసాని కిరణ్, ఎమ్మెల్సీ లెళ్ల అప్పిరెడ్డి, మచిలీపట్నం పోర్టు చైర్మన్ మేకతోటి దయా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే వాలంటీర్లపై చర్యలు : కలెక్టర్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించి రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొన్న వాలంటీర్లపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకొని, తొలగిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతి నిధులతో సమావేశం నిర్వహించారు.ఆప్ నుండి డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి నుండి సిహెచ్.వాసు, బిజెపి నుండి ఆర్.భాస్కరరావు, సిపియం నుండి వై.కష్ణకాంత్, కాంగ్రెస్ నుండి బి.సునీల్, టిడిపి నుండి కె.శివరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాటు గౌరవ వేతనాలు తీసుకుంటున్న వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో చేబ్రోలు, పెద కాకాని మండలాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొ న్న వాలంటీర్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన వాలం టీర్లపై గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకునేలా రిటర్నింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రాజకీయ పార్టీలు బహిరగ ప్రదేశాలు, ప్రైవేటు స్థలాల్లో జెండాలు, పోస్టర్ల ప్రదర్శనకు అనుమతులు తీసుకోవాలని, కరపత్రాలు, ఆడియో, వీడియో సందేశాలకు సంబంధించి ముందస్తుగా ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతి తీసుకోవా లన్నారు. ఎన్నికల ప్రవర్తన నియ మావళి పాటిస్తూ ప్రచారాలు నిర్వహించుకోవాలన్నారు. ఎన్నికల సంఘం అదేశాల మేరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు పర్యవేక్షణకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎన్నికల ప్రచారానికి, ఇతర వస్తువులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరల వివరాలను రాజకీయపార్టీల ప్రతినిధులకు అందించారు. సమావేశంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్‌ఒ పెద్దిరోజా, ఇతర రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుపై కమిషనర్ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు :ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించబోమని, అనుమతి లేకుండా ఏర్పాటు చేసే సంస్థలు, వ్యక్తులపై పోలీసు కేసులు నమోదు చేయాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అధికారులకు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్‌ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. బుధవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి), స్టాటిస్టిక్స్ సర్వైలేన్స్ టీం, వీడియోగ్రాఫ్ వ్యూయింగ్ టీం, అకౌంట్స్ ఎక్స్పెండీచర్ టీంలతో ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లో రాజకీయ ప్రకటనల ఏర్పాటుకు అవకాశం లేదని, నిబంధనలు మీరితే వారిపై పోలీసు కేసులు నమోదుకు చర్యలు తీసుకోవాలని ఎంసిసి టీంకి స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు ప్రతి కార్యక్రమానికి రిటర్నింగ్ అధికారి నుండి తగిన అనుమతి పొందాల్సిందేనని, అందుకు తగిన విధంగా జిఎంసి ప్రధాన కార్యాలయంలో సువిధ యాప్ సింగిల్ విండో కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రైవేట్ భవనాలలో ఏర్పాటు చేసే హోర్డింగ్స్‌కు భవన స్ట్రక్చరల్, స్టెబిలిటి సర్టిఫికెట్ తప్పనిసరన్నారు. జిఎంసి కమర్షియల్ ప్రకటనల స్థలాలు, ప్రైవేట్ ప్రకటనల స్థలాల్లో ఉన్న బోర్డులు అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిదికన ఇవ్వాలన్నా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిటీప్లానర్‌ను ఆదేశించారు. నగరంలో సిటీబస్‌లు, ఆటోలపై రాజకీయ ప్రకటనలు ఉంటే తక్షణం కేసులు నమోదు చేయాలని ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంను ఆదేశించారు. రాజకీయ పార్టీలు చేపట్టే ర్యాలీలు, ప్రచారవాహనాలు, డోర్ క్యాంపెయిన్, లౌడ్ స్పీకర్ల వినియోగం, తాత్కాలిక పార్టీ కార్యాలయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు క్షేత్రస్థాయిలో విస్తతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలుచేయాలని, ఎక్కడా పక్షపాత వైఖరి ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఆర్‌ఓలు, వివిధ టీంల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందమే ఆరోగ్యానికి మూలం

- ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ కోటా సురేష్ కుమార్



ప్రజాశక్తి - ఎఎన్‌యు :సంతోషంగా జీవిస్తున్న వారిలో శారీరక, మానసిక ఆరోగ్యం మెండుగా ఉంటుందని కాటూరి మెడికల్ కాలేజ్ సైకియాట్రి విభాగం శాఖాధిపతి డాక్టర్ కోటా సురేష్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ సంతోష దినోత్సవం సందర్భంగా బుధవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సైకాలజీ విభాగం, సైకాలజిస్టల సంఘం ఏపీఏ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో కలసి ఉంటే సంతోషం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ఆనందం కోసం ఎక్కడో వెతకాల్సిన పని లేదని, మనలోనూ, మన చుట్టూ ఉన్న వ్యక్తుల్లోనూ ఉంటుందని తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులతో సత్సంబంధాలే ఆనందానికి మూలమని తెలిపారు. సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ బట్టు నాగరాజు మాట్లాడుతూ మనిషి జీవితంలో అన్నిటి కంటే ముఖ్యమైనది సంతోషం అని తెలిపారు. సైకాలజీ ప్రొఫెసర్ టి.డి. విమల మాట్లా డుతూ ఇతరులకు సేవ, కృతజ్ఞత భావంతో ఆనందం అధికమవుతుందని తెలిపారు. ముఖ్య అతిధి సురేష్ కుమార్‌ను సైకాలజీ విభాగం అధ్యాపకులు, ఏపీఏ ఇండియా సభ్యులు సన్మానించారు. ఏపీఏ ఇండియా జాతీయ కార్యదర్శి రవిబార్గవ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు సభ్యురాలు లక్ష్మీ రావు విద్యార్థులతో ఆనంద నత్యాలు చేయించారు. సైకాలజీ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ వసంతరావు జీవితం ఆనందంగా గడపడం ఎలానో వివరించారు. అనంతరం హ్యాపీనెస్ పోస్టర్ ప్రజెంటేషన్ విజేతలకు సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, వసంతరావులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సైకాలజీ విభాగం అధ్యాపకులు కృష్ణ మోహన్, అనుపమ, రాణి, ఏపీఏ ఇండియా సభ్యులు సురేంద్ర, రమేష్ , నీరజ, సైకాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ


స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు

తమ తండ్రి డోగిపర్తి సుబ్బారావు వ్యాపారం ద్వారా సంపాదించిన సంపాదనలో కొంత భాగాన్ని ట్రస్ట్ ద్వారా సమాజంలోని పేద బలహీన వర్గాల ప్రజల జీవన ప్రమాణాల కోసం ఖర్చు చేస్తున్నట్లు డి.ఎస్.కళ్యాణ మందిరం ట్రస్టీ డోగిపర్తి అనంత సాంబశివరావు పేర్కొన్నారు.బుధవారం స్థానిక బ్రాడీపేట హంస జూవెలర్స్‌లో పేద విద్యార్థులకు రూ.2 లక్షలు ఉపకార వేతనాలు అందజేశారు. మరొక ట్రస్టీ శివమోహన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రూ.5 లక్షలు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ప్రతిభ, పేదరికం ఆధారంగా అంద చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సుజాత, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, రామారావు, లక్ష్మణరావు దీప్తి, హర్ష, చక్ర, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు